సంతకాలు చేయించుకొని నిధులు కాజేస్తున్నారు..

- ఎంపీడీఓపై ఎంపీటీసీల ధ్వజం



ఎంపీడీఓను ప్రశ్నిస్తున్న ఎంపీటీసీలు

పెద్దదోర్నాల: తమతో సంతకాలు చేయించుకుని మండల పరిషత్ నిధులు దోచుకుంటున్నారంటూ మండలానికి చెందిన ఎంపీటీసీ సభ్యులు ఎంపీడీఓ నాసర్‌రెడ్డి తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ గుమ్మా పద్మజ అధ్యక్షతను మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. సమావేశం ఆరంభంలోనే ఎంపీటీసీ సభ్యులకు, ఎంపీడీఓకు మధ్య వాదనలు ప్రారంభమయ్యాయి. ఎంపీటీసీ సభ్యులు ఎంపీడీఓ తీరుపై తీవ్రంగా విరుచుకుపడ్డారు. తమ ప్రాదేశికాల్లో ఒక్క పని కూడా చేయించుకోలేక పోతున్నామని మండిపడ్డారు. తమ గ్రామాల్లో నీటి సమస్య ఉందని అధికారుల దృష్టికి తీసుకెళ్తే సమస్యను పరిష్కరించిన నాథుడే లేడన్నారు. ఐనముక్కల ఎస్సీపాలెం ప్రాథమిక పాఠశాలలో 60 మంది చిన్నారులు విద్యాభ్యాసం చేస్తున్నారని, వారికి ఇద్దరు ఉపాధ్యాయులు మాత్రమే విద్యా బోధన చేస్తున్నారని, టీచర్లను పెంచమని అడిగినా పట్టించుకోలేదని మండల పరిషత్ ఉపాధ్యక్షులు దర్శనం నాగయ్య ఆరోపించారు. దీంతో పాటు రోడ్ల మరమ్మతులు, డ్రైనేజీ కాలువల పనులు మీకు ఇష్టం వచ్చిన వారికి, వారు చెప్పిన చోటే వేయిస్తున్నారని ధ్వజమెత్తారు. తీర్మానాల పుస్తకంలో తీర్మానాల మధ్య ఖాళీని ఉంచి తమతో సంతకాలు చేసుకుంటున్నారని, సమావేశం ముగిసిన తర్వాత మీ కిష్టమైన తీర్మానాలను అయా ఖాళీల్లో చేర్చుకుని నిధులు దిగమింగుతున్నారని ఎంపీడీఓపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ఎంపీటీసీ సభ్యులు, ఎంపీడీఓ వాదనలతో సమావేశం కొద్దిసేపు వాడీవేడిగా జరిగింది. అనంతరం సాధారణ సమస్యలపై చర్చ జరగగా అధికారులు ఆయా సమస్యలపై చర్చించారు.

విద్యుత్ అధికారుల వింత చేష్టలు

- లబోదిబోమంటున్న వినియోగదారులు
- ఆలస్యంగా విడుదలైన పెరిగిన బిల్లులు



మంగళవారం బిల్లు తీస్తున్న యువకుడు

కురిచేడు: విద్యుత్ శాఖ అధికారుల వింత చేష్టలతో వినియోగదారులు తలలు పట్టుకుంటున్నారు. ఇప్పటికే నూతనంగా ఏర్పాటు చేసిన మీటర్లతో విద్యుత్ బిల్లులు మోత మోగుతున్నాయి. దానికి తోడు బిల్లులు తీయడం ఆలస్యం కావడంతో ఒక్కసారిగి బిల్లులు పెరిగి సామాన్యుడు నడ్డి విరుస్తున్నాయి. కురిచేడు మండలంలో విద్యుత్ వినియోగదారులకు నెలవారి బిల్లులను 8వ తేదీ ఇస్తుంటారు. జూన్‌లో బిల్లులు 10వ తేదీ వరకు తీయక పోవడంతో వినియోగదారులపై అధిక భారం పడింది. వినియోగదారులు లైన్‌మెన్ ఉంటే అతడిని బిల్లులు తీయలేదని ప్రశ్నించే అవకాశం ఉండేది. మండల కేంద్రానికి లైన్‌మెన్ కూడా లేకపోవడంతో వినియోగదారులు ఏ సమస్య వచ్చినా ఎవరిని అడగాలో అర్థంగాక అయోమయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. హడావుడిగా కొత్త వ్యక్తులతో 10వ తేదీ బిల్లులు తీయటం చర్చనీయాంశంగా మారింది. సామాన్యంగా విద్యుత్ బిల్లులు 30 రోజుల్లోపు తీస్తే వచ్చే రీడింగ్ కారణంగా స్లాబ్ రేట్లు ఉంటాయి. అంతకు మించి ఎక్కువ రోజులు గడిస్తే ఆ రోజుల్లో వినియోగించిన విద్యుత్ రీడింగ్ అదనంగా చేరడంతో విద్యుత్ బిల్లు శ్లాబు మారి ప్రతి నెలా వచ్చే బిల్లు కన్నా అదనంగా వస్తుంది. వినియోగం కొంచమైనా శ్లాబు మారడంతో నెల మొత్తానికి కొత్త శ్లాబు వర్తించటంతో బిల్లులు అధికంగా వస్తున్నాయి. విద్యుత్ సిబ్బంది కొరత ఉండటం, రెగ్యులర్‌గా బిల్లులు తీసే వారికి అనారోగ్యంగా ఉండటంతో ఈ పరిస్థితి నెలకొన్నట్లు విద్యుత్ శాఖ అధికారులు పేర్కొంటున్నారు. విద్యుత్ శాఖలో సిబ్బంది పూర్తిస్థాయిలో ఉంటే సకాలంలో బిల్లులు తీసి ఉండేవారని, తద్వారా బిల్లులు అధికంగా కాకుండా రెగ్యులర్‌గా వచ్చే విధంగానే వచ్చి ఉండేవని ప్రజలు విమర్శిస్తున్నారు. విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యంతో పేదలు మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుంది. విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యం కారణంగా గత నెలలోలా బిల్లులు వసూలు చేయాలని వినియోగదారులు కోరుతున్నారు. అదనంగా బిల్లులు చెల్లించకుండా అనుమతి ఇవ్వాలని, సిబ్బంది కొరతను వెంటనే భర్తీ చేయాలని వినియోగదారులు కోరుతున్నారు.

108లో గర్భిణి ప్రసవం



108లో కాన్పు చేసిన సిబ్బంది

కురిచేడు: మండలంలోని దేకనకొండ ఎస్సీ కాలనీకి చెందిన వై. సాగర్‌మేరి మంగళవారం 108లో ప్రసవించింది. తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారు. వివరాలు.. సాగర్‌మేరికి పురిటి నొప్పులు వచ్చాయి. కుటుంబ సభ్యులు 108 సిబ్బందికి సమాచారం అందించారు. సిబ్బంది యోహాను, నరేష్‌బాబులు ఆమెను వాహనంలో దర్శి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ కాన్పు కష్టమని మెరుగైన వైద్యం కోసం ఒంగోలు రిమ్స్‌కు తరలించాలని సిబ్బంది సూచించారు. రిమ్స్‌కు వెళ్లే క్రమంలో మార్గమధ్యంలో సాగర్‌మేరికి పురిటి నొప్పులు అధికం కావటంతో ఆమె కుటుంబ సభ్యుల అంగీకారం మేరకు 108లో కాన్పు చేశారు. సాగర్‌మేరి ఆడ శిశువుకు జన్మనిచ్చింది. తల్లి, బిడ్డ క్షేమంగా ఉండటంతో వారిని రిమ్స్‌కు తరలించారు. బంధువులు 108 సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

హుండీ ఆదాయం రూ.17.17 లక్షలు



హుండీ లెక్కిస్తున్న సిబ్బంది

త్రిపురాంతకం: శ్రీబాలా త్రిపురసుందరీదేవి, శ్రీపార్వతి సమేత త్రిపురాంతకేశ్వరస్వామి ఆలయాలకు భక్తులు సమర్పించిన హుండీ ఆదాయం రూ.17.17 లక్షలు వచ్చినట్లు ఆలయాల ఈఓ రజనీకుమారి తెలిపారు. త్రిపురాంతకం శ్రీబాలాత్రిపురసుందరీదేవి ఆలయానికి 12,13,154 రూపాయలు, శ్రీత్రిపురాంతకేశ్వరస్వామి ఆలయానికి 4,40,425 రూపాయలు, అన్నదానం ద్వారా 63,675 రూపాయల ఆదాయం సమకూరినట్లు వివరించారు. లెక్కింపు కార్యక్రమంలో దేవదాయ శాఖతో పాటు, రెవెన్యూ, పోలీస్, బ్యాంక్ సిబ్బంది, సేవ సమితి సభ్యులు పాల్గొన్నారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

కురిచేడు: మండల సర్వసభ్య సమావేశం గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలోని సమావేశపు హాలులో నిర్వహించనున్నారు. సమావేశంలో మండలంలోని పలు సమస్యలపై చర్చించనున్నారు. మండల స్థాయి అధికారులందరూ తమ శాఖలకు సంబంధించిన పూర్తి సమాచారంతో హాజరు కావాలిన ఎంపీడీఓ శ్రీదేవి సూచించారు. జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, గ్రామ పంచాయతీ సర్పంచులు, అన్ని శాఖల అధికారులు తప్పకుండా హాజరు కావాలని ఆమె కోరారు.

ఖాతాదారులకు మెరుగైన సేవలే లక్ష్యం



మాట్లాడుతున్న మేనేజర్ మనస్వీ

పుల్లలచెరువు: ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యమనం స్థానిక ఎస్‌బీఐ మేనేజర్ మనస్వీ అన్నారు. సోమవారం రాత్రి మండలంలోని ఉమ్మడివరంలో గ్రామస్తులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మేనేజర్ మనస్వీ మాట్లాడుతూ ఎస్‌బీఐ ఖాతాదారులకు అనేక రకాల సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. ఖాతాదారులకు సేవింగ్స్ ఖాతాలతో పాటు ప్రమాద బీమా కూడా చేసుకునే అవకాశం ఉందన్నారు. ఖాతాదారులకు అన్ని రకాల రుణాలు మంజూరు చేస్తున్నామని, రుణాలు తీసుకున్న ఖాతాదారులు సకాలంలో రుణాలు చెల్లిస్తే రూ.33 పైసలు మాత్రమే వడ్డీ పడుతుందని పేర్కొన్నారు. బీమాకు సంబంధించి బ్యాంక్ ఖాతాదారులు సంవత్సరానికి రూ.2 వేలు చెల్లిస్తే రూ.40 లక్షల యాక్సిడెంట్ బీమా ఉంటుందని, దీనిపై అవగాహన పెంచుకోవాలన్నారు. సూర్య ఘర్ సోలార్ ప్యానల్స్ ఏర్పాటు చేసుకునేందుకు బ్యాంక్ రుణ సదుపాయం కల్పిస్తుందని, ఆసక్తి ఉన్న వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఖాతాదారులు బ్యాంక్ సేవలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎస్‌బీఐ లైఫ్ మిత్ర ఆర్మీ బుజ్జీ మాట్లాడుతూ ఎస్‌బీఐ బ్యాంక్ ఇన్సూరెన్స్‌లో ఉందని, దేనిలో లేని విధంగా అన్ని వర్గాలకు సంబంధించి బీమా పథకాలు కేవలం ఎస్బీఐ లైఫ్‌లో మాత్రమే ఉన్నాయని తెలిపారు. వివిధ బీమా పథకాలకు సంబంధించి అవగాహన కల్పించారు. గిద్దలూరు మేనేజర్ సీతారామయ్య, ఫీల్డ్ ఆఫీసర్ రమేష్, అసిస్టెంట్ ఫీల్డ్ ఆఫీసర్ నాసరయ్య పాల్గొన్నారు.

బైకును ఢీకొన్న ప్రైవేట్ బస్సు

- ఇద్దరికి గాయాలు



గాయపడిన సుభానీ



మస్తాన్.

కురిచేడు: ద్విచక్ర వాహనాన్ని వేగంగా వచ్చిన ట్రావెల్స్ బస్సు ఢీకొట్టడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ సంఘటన ప్రకాశం, పల్నాడు జిల్లాల సరిహద్దు యోగిరెడ్డిపాలెం రైల్వే బ్రిడ్జి వద్ద మంగళవారం జరిగింది. వివరాలు.. దర్శికి చెందిన షేక్ సుభానీ, షేక్ మస్తాన్‌లు బైక్‌పై పల్నాడు జిల్లా వినుకొండకు వెళ్తున్నారు. యోగిరెడ్డిపాలెం రైల్వే బ్రిడ్జి వద్దకు వెళ్లే సరికి వెనుక బెంగళూరు నుంచి వినుకొండ వైపు వెళ్తున్న ట్రావెల్స్ బస్సు వేగంగా వచ్చి ఢీకొట్టింది. బైక్‌పై ఉన్న ఇద్దరికి గాయాలయ్యాయి. 108 సిబ్బంది ప్రసాద్, షేక్ అబ్దుల్ రహమాన్‌లు క్షతగాత్రులకు ప్రథమ చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

ప్రభుత్వ పాఠశాలలకు పుస్తకాల పంపిణీ



హెచ్‌ఎంలకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎంఈఓలు

పెద్దారవీడు: మండలంలోని దేవరాజుగట్టు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి ప్రభుత్వ పాఠశాలలకు సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర ద్వారా విద్యా సామగ్రిని ఎంఈఓలు 1, 2 పి. శ్రీనివాసులు, సుబ్రహ్మణ్యంలు మంగళవారం పంపిణీ చేశారు. ప్రధానోపాధ్యాయుల పర్యవేక్షణలో మండల పరిషత్ ప్రాథమిక, ప్రాథమికోన్నత, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో 1 నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న దాదాపు 5,900 మంది విద్యార్థులకు విద్యా సామగ్రిని నేరుగా ఆటోల్లో పంపిణీ చేసినట్లు తెలిపారు. 12వ తేదీన మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలు పునఃప్రారంభిస్తారని, ఆ రోజు ప్రతి విద్యార్థికి పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాలు, యూనిఫాం, షూస్, బెల్టు, తదితర వస్తువులు అందజేయాలని ప్రధానోపాధ్యాయులకు సూచించారు.

బాల్య వివాహాలు అరికట్టాలి



ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

దొనకొండ: ఆడ పిల్లలకు చిన్న వయసులోనే వివాహ చేయడం నేరమని ఐసీడీఎస్ దర్శి సీడీపీఓ ఎస్.భారతి అన్నారు. మంగళవారం స్థానిక స్త్రీ శక్తి భవనంలో కిశోర వికాస కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లా రిసోర్స్ పర్సన్ వీరాంజనేయులు హాజరై మాట్లాడారు. బాల్య వివాహాలు నేరమని, ఆడ పిల్లలను చదువుకునే విధంగా తల్లిదండ్రులు చూసుకోవాలన్నారు. అనంతరం ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు. చిన్నారుల తల్లులకు అవగాహన కల్పించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సీహెచ్ సుభాషిణి, అంగన్‌వాడీ టీచర్లు, మహిళా పోలీసులు, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.